క్లుప్తంగా

ఆశ్రమాల సందర్శన

కర్నూలు (లీగల్) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి శుక్రవారం కర్నూలులోని బాలల పరిశీలన గృహం, వేదాస్ షెల్టర్ హోం, వన్‌స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి అక్కడ ఉన్న ప్రజలకు, మహిళలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చట్టంతో నివేదించబడిన బాలలకు సంబంధించిన చట్టాలను, ఉచిత న్యాయ సహాయం గురించి తెలియజేశారు. మహిళలకు, పిల్లలకు లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని పొందుటకు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది బి.లక్ష్మీనారాయణ, ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం సూపరింటెండెంట్ ఎం.హుసేన్ బాషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ రాధికకు డాక్టరేట్


రాధిక

కర్నూలు కల్చరల్: నగరానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.రాధిక రాయలసీమ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. ఈ మేరకు వర్సిటీ రీసర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ వీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఈమె రాజమండ్రి ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ పి.సురేష్ వర్మ పర్యవేక్షణలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి 'సెమన్టిక్ సిమిలారిటీ మెజర్స్ ఫర్ రెస్పిరేటరీ సిస్టమ్ డిసీజెస్ ఆంటాలజీ' అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ అవార్డు ప్రదానం చేశారు. డాక్టరేట్ అందుకున్న రాధిక సహకరించిన ఆర్‌యూ వీసీ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్, రీసర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి, గైడ్ ప్రొఫెసర్ పి.సురేష్ వర్మకు కృతజ్ఞతలు తెలిపారు.

నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి


రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్) : నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని పట్టణ పౌరసంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈ.పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన బళ్లారి చౌరస్తా ఏరియాలో పేరుకుపోయిన మురికి కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నగర పాలక సిబ్బందికి పన్నులు పెంచడంపై ఉన్న శ్రద్ధ పారిశుద్ధ్యంపై లేదన్నారు. దీంతో చిన్నపాటి వర్షాలు వస్తేనే నగరంలో ఎక్కడ చూసినా రోడ్లపై మురుగు నీరు నిలుస్తోందన్నారు. ఆయన వెంట నాయకులు గోపీనాథ్, పరమేష్, వెంకటరెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

అనారోగ్యంతో సిట్రా చిరంజీవి మృతి

కర్నూలు(టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గడ్డం రామకృష్ణల రెండవ కుమారుడు, 25వ వార్డు పార్టీ ఇన్‌చార్జి సిట్రా చిరంజీవి(38) అనారోగ్యంతో మరణించారు. ఈనెల 14న తెల్లవారుజామున అస్వస్థతకు గురైన చిరంజీవిని కుటుంబ సభ్యులు హుటాహుటిన ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. నాలుగు రోజులుగా చికిత్స పొందుతున్న ఆయన కోలుకోలేక శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఆకస్మిక మృతి పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

రేపు బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాల సందర్భంగా మీదివేముల గ్రామంలో ఈ నెల 19వ తేదీ ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పద్మనాభరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9701726001, నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పెరిగిన ఆలయ భూముల ఆదాయం

ఓర్వకల్లు: మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో వెలసిన యాగంటీశ్వర, చెన్నకేశవ, ఆంజనేయ, ఈశ్వర, చౌడేశ్వరి దేవాలయాలకు చెందిన భూముల ఆదాయం గణనీయంగా పెరిగింది. శుక్రవారం స్థానిక శివాలయం వద్ద బహిరంగ వేలం పాట నిర్వహించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఆలయ ఈఓ మద్దిలేటి ఆధ్వర్యంలో వేలం పాట జరిగింది. ఆయా దేవాలయాలకు చెందిన 106 ఎకరాలను రూ.13,77,500లకు రైతులు కౌలుకు దక్కించుకున్నారు. ఇదే భూములు గత ఏడాది రూ.9,52,000లకు దక్కించుకున్నారు.

జీవనశైలి మారడంతోనే అధిక రక్తపోటు

- ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటించాలి
- డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): మానవుని జీవనశైలి మారడంతో అధిక రక్తపోటు బాధితులు పెరుగుతున్నారని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ప్రపంచ అధిక రక్తపోటు నివారణ దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అధిక రక్తపోటు ఆరోగ్యానికి చేటు అని చెప్పారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మానసిక ఒత్తిడి, వ్యాయామం లేకపోవడం, ఆహారపు అలవాట్లు, వంశపారంపర్యం, మద్యపానం, దూమపానం, ఆహారంలో ఉప్పు అధికంగా తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు వస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటించాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, ఆహారంలో ఉప్పు తగ్గించుకోవాలని, యోగా, ధ్యానం చేసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పనిచేసే అధికారులు, ఉద్యోగులకు రక్తపోటు పరీక్షలు చేసి, అధిక రక్తపోటు ఉన్న వారికి ఆహార నియమాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే పీఓ హేమలత, డీపీఎంఓ డాక్టర్ ఉమా, డెమో ప్రమీలాదేవి, డీపీహెచ్ఎన్ఓ ఇందిర, ఎస్ఓ హేమసుందరం, డిస్ట్రిక్ట్ ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ఎపడమాలజిస్టు వేణుగోపాల్, డీపీఓ విజయరాజు, హెచ్ఈఈఓ శ్రీనివాసులు, డిప్యూటీడెమోచంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బీపీ పరీక్ష చేయించుకోవాలి

సమాజంలో 35 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బీపీ పరీక్ష చేయించుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద అన్నారు. అంతర్జాతీయ రక్తపోటు దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక శ్రీరామనగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సింధియా శుభప్రద మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, అశ్రద్ధ వహించరాదన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వైష్ణవి, డాక్టర్ నాగరాజు, డాక్టర్ రవినాయక్, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ అలీ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్య, లెక్చరర్ సురేష్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ షణ్ముఖుడు, హెల్త్ సూపర్‌వైజర్ సాయిరామ్, మాధవరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ చైతన్యకుమార్

అధిక రక్తపోటుతో గుండెజబ్బులు

అధిక రక్తపోటుతో గుండెజబ్బులు వచ్చే ప్రమాదం ఉందని కార్డియాలజిస్టు డాక్టర్ ఎన్. చైతన్యకుమార్ చెప్పారు. అంతర్జాతీయ అధిక రక్తపోటు దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీపీ ఒక్కసారి వచ్చిందంటే జీవితంలో మళ్లీ తగ్గదన్నారు. కేవలం దానిని పెరగకుండా మనం నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. బీపీ వల్ల చాలా మంది హార్ట్ అటాక్‌కు గురై మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమస్యలు రాకుండా ముందే జాగ్రత్తలు తీసుకోవాలని, బీపీని మందులతోనే గాకుండా సరైన ఆహారంతోనూ తగ్గించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కార్డియాలజిస్టులు డాక్టర్ సీఎస్. తేజానందన్‌రెడ్డి, డాక్టర్ బీఎస్. ప్రవీణ్‌కుమార్, హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ వై. మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఎవరు గెలుస్తారు!

- నగరంలో ఎక్కడ చూసినా ఇదే చర్చ
- కర్నూలు అసెంబ్లీ స్థానం ఫలితంపై ఉత్కంఠ
- ఓటర్ల మధ్య రసవత్తర చర్చ



హలో బావా... వారం రోజులయ్యింది నిన్ను చూసి.. వారం క్రితం నుంచి ఇటువైపు రావడమే మానేసావు... ఏమైపోయావేంటి?

ఆ... ఏమీ లేదు బావా. నిన్నమొన్నటి వరకు ఎన్నికల సందడి కదా.. వచ్చినా కూడా మనమింత ప్రశాంతంగా కూర్చొని మాట్లాడుకోవడానికి వీలు పడేదా చెప్పు.

అదీ నిజమేలే. ఇంతకీ నిన్న జరిగిన ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనుకుంటున్నారు? రకరకాలుగా చెప్పుకుంటున్నారు. అభ్యర్థులు కూడా ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. తెలిస్తే చెప్పు బావా... టెన్షన్ తట్టుకోలేకపోతున్నా.

రాజకీయాల విషయంలో నాకంటే నీకే ఎక్కువ సంగతులు తెలుస్తాయని, అడుగుదామని ఇక్కడికి వచ్చాను. నువ్వేమో నాపై ఛలోక్తులు వేస్తున్నట్లుగా మాట్లాడుతున్నావు. ఇదెక్కడి రాజకీయం బావా?

కర్నూలు వెంకటరమణ కాలనీలోని ఓ పార్కులో ఇద్దరు వయోజనుల మధ్య జరిగిన చర్చ సారాంశమిది. సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. ఫలితాల వెలువడేందుకు మరో 18 రోజులు ఉండటంతో ప్రస్తుతం ఎవరిని కదిలించినా ఆసక్తికరమైన చర్చలకు తెర లేపుతున్నారు. కర్నూలు నియోజకవర్గం ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గు చూపారనేది సర్వత్రా ఆసక్తి కలిగిస్తున్న అంశంగా నలుగురు కూడిన ప్రతిచోటా చర్చలు జరుగుతున్నాయి. నగర ప్రజల నిర్ణయంపై ఆసక్తికరంగా పొరుగు నియోజకవర్గాల వారు కూడా ఫోన్లు చేసి మరీ ఆరా తీస్తూ చర్చిస్తున్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి బరిలోకి దిగిన హాఫీజ్ ఖాన్ విజయం సాధించారు. 1952లో ఏర్పడిన ఈ నియోజకవర్గంలో 15 సార్లు ఎన్నికలు జరగ్గా ఐదుగురు మైనార్టీ ప్రముఖులు శాసనసభకు ఎన్నికయ్యారు. 1972లో రెహ్మాన్ ఖాన్, 1978లో ఎండీ ఇబ్రహీం ఖాన్, 1994, 2004లో సీపీఎం తరఫున ఎంఏ గఫూర్, 2019లో హాఫీజ్‌ఖాన్ గెలుపొందారు. సామాజికవర్గ పరంగా కర్నూలులో ముస్లిం ఓట్లు అధికంగా ఉన్నాయి. 16వసారి జరుగుతున్న ప్రస్తుత ఎన్నికల్లో కూడా మైనార్టీ వర్గానికి చెందిన ఎండీ ఇంతియాజ్ బాషా వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో నిలిచారు. ఆయనకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. ఫలితాలు వెలువడే జూన్ 4వ తేదీ వరకు ఉత్కంఠ తప్పదని ఓటర్లు చర్చించుకుంటున్నారు.

–కర్నూలు

నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

కర్నూలు (టౌన్): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ సహకారంతో నగరంలో శనివారం నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 15 వ తేదీ వరకు 16 క్రీడాంశాల్లో ఈ శిక్షణ శిబిరాలు ఉంటాయన్నారు. 08 సంవత్సరాల నుంచి 16 ఏళ్ల లోపు బాల బాలికలు ఈ వేసవి శిబిరాలను వినియోగించుకోవాలని తెలిపారు. వివరాలకు 08518–225419 ఫోన్ నంబర్‌కు లేదా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల సమయంలో సంప్రదించాలని తెలిపారు.

నగరంలో నిర్వహించే వేసవి క్రీడా శిక్షణ శిబిరాల వివరాలు

వరుస సంఖ్య	క్రీడాంశం పేరు	స్థలం	ఫోన్ నెంబర్
1.	ఎయిర్ రైఫిల్ షూటింగ్	అశోక్ నగర్	8464815130
2.	అథ్లెటిక్స్	బి.క్యాంప్ క్రీడా మైదానం ఎస్టీబీసీ క్రీడా మైదానం ఔట్‌డోర్ స్టేడియం	8919409232
3.	బాస్కెట్ బాల్	ఔట్‌డోర్ స్టేడియం	6302876285
4.	ఫుట్‌బాల్	కోల్స్ కళాశాల క్రీడామైదానం ఔట్‌డోర్ స్టేడియం	7981567752
5.	హ్యాండ్‌బాల్	బి.క్యాంప్ క్రీడా మైదానం ఔట్‌డోర్ స్టేడియం	9515356429
6.	హాకీ	ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానం ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానం మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానం (ఓల్డ్ కంట్రోల్ రూం)	9705076668
7.	కిక్ బాక్సింగ్	బి.క్యాంప్ క్రీడా మైదానం	8247644847
8.	కబడ్డీ	ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానం	9908231019
9.	రగ్బీ	బి.క్యాంప్ క్రీడా మైదానం	8186853163
10.	సిలంబం	మున్సిపల్ హైస్కూల్ , (పాత కంట్రోల్ రూం)	9849658813
11.	సెపక్‌తక్రా	బి.క్యాంప్ క్రీడామైదానం	9441110161
12.	తైక్వాండో	పెద్దమార్కెట్ (కేఎంసీ పార్కు) ప్రజాశక్తి ఆఫీస్ మైదానం	9849971256
13.	త్రోబాల్	ఔట్‌డోర్ స్టేడియం	8639855602
14.	వాలీబాల్	హోసన్నా క్రీడా మైదానం నెహ్రూ మెమోరియల్ హైస్కూల్	7799661773
15.	ఉషూ	జొహరాపురం ప్రభుత్వ బాలికల పాఠశాల, బీక్యాంప్	8978120529
16.	యోగా	జొహరాపురం (ఇందిరమ్మ కాలనీ) సంతోష్ నగర్	9247400100

నగర పాలనపై అవగాహన కల్పించాలి

కర్నూలు (టౌన్): కర్నూలుకు విచ్చేసిన ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణిని నగరపాలన వ్యవహారాలపై అవగాహన కల్పించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో ట్రైనీ కలెక్టర్‌తో కలిసి నగరపాలక సంస్థలోని వివిధ విభాగాల అధికారులతో కమిషనర్ సమావేశమయ్యారు. ఈనెల 25 వ తేదీ వరకు నగరపాలక సంస్థ మెయిన్ సెక్షన్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, రెవెన్యూ, అకౌంట్స్, పట్టణ పేదరిక నిర్మూలన తదితర విభాగాలు నిర్వహిస్తున్న కార్యకలాపాలపై ట్రైనీ కలెక్టర్‌కు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్య, కుడా ప్లానింగ్ ఆఫీసర్ విజయ భాస్కర్, రెవెన్యూ అధికారి జునీద్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించిన ఆర్ఓ

నగర శివారులోని రాయలసీమ యూనివర్సిటీలో 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌ను శుక్రవారం రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ సందర్శించారు. భద్రత ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత రిజిస్టర్‌లో సంతకం చేశారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- పాణ్యం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కోసం 14 టేబుళ్ల ఏర్పాటు
- 23వ తేదీన కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ
- పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్) : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 13వ తేదీన పాణ్యం అసెంబ్లీ, నంద్యాల పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించామని, 74.45 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఆ నియోజకవర్గ ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య తెలిపారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ.. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో జూన్ 4వ తేదీన నిర్వహించే కౌంటింగ్‌కు సన్నద్ధమవుతున్నట్లు చెప్పారు. పాణ్యం నియోజకవర్గం కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామని, ఒక్కో టేబుల్‌కు ఒక్క సూపర్ వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు ఉంటారన్నారు. రాజకీయ పార్టీల నుంచి కౌంటింగ్ ఏజెంట్లను అనుమతిస్తామని చెప్పారు.కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి అవ్వగానే మే 23వ తేదీన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి

- హెచ్ఓడీలు, ప్రొఫెసర్లతో పెద్దాసుపత్రి సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలోని రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. శుక్రవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో హెచ్ఓడీలు, ప్రొఫెసర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేసిన పీడియాట్రిక్, గైనిక్ విభాగాల హెచ్ఓడీలను అభినందించారు. పలు విభాగాల్లో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ తిరస్కరించిన ఆరోగ్యశ్రీ కేసులు బాగా తగ్గిపోయాయని తెలిపారు. ఈ 15 రోజుల్లో 8 కేసులు తిరస్కరణకు గురయ్యాయని చెప్పారు. వాటిని తిరిగి దరఖాస్తు చేయాలని హెచ్ఓడీలకు సూచించారు. పలు విభాగాల్లో ఈ–హాస్పిటల్ ఇంప్లిమెంటేషన్ బాగా చేశారని అభినందించారు. ఈ–హాస్పిటల్‌లో ల్యాబ్ మాడ్యూల్ ఇంకా ఇంప్రూవ్ చేసుకోవాలని బయోకెమిస్ట్రీ, పెథాలజీ, మైక్రోబయాలజీ హెచ్ఓడీలకు చెప్పారు. అన్ని విభాగాల్లో ఉండే హౌస్ సర్జన్లు ఎఫ్ఆర్ఎస్ ద్వారా తప్పకుండా హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఓడీలను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సునీల్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మగ శిశువును గుర్తించి తీసుకెళ్లండి


డోన్ సమీపంలో లభ్యమైన శిశువు

కర్నూలు(అర్బన్): ఈ నెల 12వ తేదీన నంద్యాల జిల్లా డోన్ రైల్వేగేట్ సమీపంలో లభ్యమైన మగ శిశువును గుర్తించి తీసుకెళ్లాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి పి. వెంకటలక్ష్మమ్మ కోరారు. రైల్వేగేట్ సమీపంలో లభించిన శిశువును అక్కడి సీడీపీఓ, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ వర్కర్ డోన్ అర్బన్ పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించి బాబును ఈ నెల 15వ తేదీన స్వాధీనం చేసుకొని కర్నూలు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందుకు తీసుకువచ్చారన్నారు. కర్నూలు బాలల సంక్షేమ కమిటీ ఉత్తర్వుల మేరకు శిశువును ప్రస్తుతం స్త్రీ శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన శిశు గృహంలో ఉంచడం జరిగిందన్నారు. ఈ శిశువుకు సంబంధించిన తల్లిదండ్రులు, బంధువులు ఎవరైనా ఉంటే వెంటనే తమ వద్ద ఉన్న ఆధారాలతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ లేదా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులను కలిసి బాలుడిని తీసుకుపోవాలన్నారు. ఎవరు రాని పక్షంలో 30 రోజుల అనంతరం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నిర్ణయం మేరకు అనాథగా తీర్మానించి సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ నిబంధనల మేరకు దత్తత ఇస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): నగరం పరిధిలోని బాబా బృందావన్ నగర్, రాజీవ్ నగర్, కర్నూలు సర్వజన వైద్యశాలలో శనివారం కొద్ది గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు. బాబ బృందావన్ నగర్‌లో 11కేవీ విద్యుత్ లైన్‌ల మెయిన్‌టెనెన్స్ వర్కులు జరుగుతున్నందున ఉదయం 09 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు సర్వజన వైద్యశాల సబ్ స్టేషన్‌లో సిటీ మార్పు చేస్తున్నందున కొంత భాగంలో ఉదయం గంట పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

పెద్దాసుపత్రిలో పిచ్చికుక్క స్వైరవిహారం


కుక్క దాడిలో గాయపడిన సెక్యూరిటీ గార్డు తులసి

కర్నూలు(హాస్పిటల్): పెద్దాసుపత్రిలో శుక్రవారం ఉదయం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. ఆసుపత్రిలోని గైనిక్ విభాగం నుంచి సూపర్‌స్పెషాలిటీ విభాగం వరకు అది పరుగు పెడుతూ అడ్డు వచ్చిన ప్రతి ఒక్కరినీ కాటు వేసుకుంటూ వెళ్లింది. పిచ్చి కుక్క దాడిలో దోర్నాలకు చెందిన మూడేళ్ల నాగలక్ష్మి తీవ్రంగా గాయపడింది. ఆ పాప పెదవిపై భాగాన్ని కొరకడంతో పెద్ద గాయమైంది. పాపతో పాటు ఆసుపత్రి సెక్యూరిటీ గార్డు తులసి, రోగుల సహాయకులు ఎల్లప్ప, రాజు, డాక్టర్ సతీష్ గాయపడ్డారు. దీంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులు భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఆసుపత్రి సెక్యూరిటీ గార్డులు కొందరు ఆ కుక్కను వెంబడించి కర్రలతో కొట్టి చంపారు.

19న సామూహిక భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ ఉదయం 9.30 గంటలకు సంకల్ బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో సంపూర్ణ సామూహిక భగవద్గీత పారాయణ యజ్ఞ నిర్వహిస్తున్నట్లు గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డి.వి.రమణ తెలిపారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, సభ్యులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కపిల్ సిబాల్ ఎన్నికపై హర్షం

కర్నూలు (లీగల్): సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికవడంపై కేడీబీఏ జిల్లా ప్రధాన కార్యదర్శులు బి.కృష్ణమూర్తి, బీఎస్ రవికాంత్ ప్రసాద్ శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తి అధ్యక్షుడిగా ఎన్నికవడం హర్షణీయమన్నారు.

మార్కెట్ యార్డు హమాలీల విరాళం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మార్కెట్ యార్డులో పనిచేసే హమాలీలు సీపీఎంకు ఎన్నికల విరాళంగా రూ.40 వేలను ప్రకటించారు. శుక్రవారం సుందరయ్య భవన్‌లో సేకరించిన విరాళ మొత్తాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి, నగర కమి టీ కార్యదర్శి టి.రాముడు, సీఐటీయూ నగర నాయకులు నరసింహులుకు అందజేశారు.

ఘనంగా వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబలకు అభిషేకం, పూజలు నిర్వహిస్తున్న విశ్వ బ్రాహ్మణులు

కర్నూలు(అర్బన్): శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 331వ ఆరాధనోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక ఉద్యోగనగర్‌లోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయానికి వివిధ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు ఉదయాన్నే పెద్ద సంఖ్యలో చేరుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి మాట్లాడుతూ విశ్వకర్మ వంశంలో జన్మించిన వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రపంచ మానవాళికి దిశా నిర్దేశం చేశారన్నారు. తాను రాసిన కాలజ్ఞానం ద్వారా భూత భవిష్యత్, వర్తమాన కాలాలను వివరించారన్నారు. కులమతాలకు అతీతంగా అనేక మందిని తన శిష్యులుగా స్వీకరించి ప్రబోధం చేసి సామాజిక తత్వవేత్త అయ్యారన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు రమణాచారి, శ్రీనివాసులు, రామచంద్రయ్య ఆచారి, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

కర్నూలు కల్చరల్: వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా శుక్రవారం ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనను మామిళ్ల పల్లిరాజేష్ శర్మ ఆధ్వర్యంలో గోవింద మాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వార్లకు పంచామృతాభిషేకం, శ్రీలలితా సహస్ర నామ పారాయణం, స్వామి వార్ల కల్యాణోత్సవం, రథోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర గురించి భక్తులకు వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.